# సమూహ సమరం

"సరింగ పట్టుకోహే... రేసీకటి మొగం దానా." సరసంగా విసుక్కున్నాడు భార్యను రాజయ్య. "సాల్లే వూర్కో సంబడం..నే గట్టిగనే పట్టుకున్నా, ఆ పంపసలు పన్జేత్తందో లేదో... నువ్వూర్కే తుపుక్ తుపుక్ మంటూ ఆడిత్తంటే గాలేటెక్కిద్దీ" నిష్టూరాలాడింది జయమ్మ.

"నీ తెలివి తెల్లారిందిలేగానీ... ఇకసాల్లే" అంటూ సైకిల్ పంపును గోడవారగా పెట్టేడు రాజయ్య.

తోపుడు బండిని పాత గుడ్డతో తుడవసాగింది జయమ్మ.

బాగా పండిపోయివున్న అరటిపండ్ల గెలల్ని ఒద్దికగా బండిమీద పెట్టుకున్నాడు రాజయ్య. చాలా పండ్లు గెల నుండి వూడిపోయినై. వాటన్నింటిని పొందిగ్గా బండి మీద సర్దిపెట్టుకున్నాడు.

"ఈగో ఇవి మరీ పండినై మావా. ఈట్నిగూడ ఏసుకెల్తావా" గోడవారగా ఉన్న పండ్లు చూపుతూ అడిగింది జయమ్మ.

"అన్నీ తీసుకెళ్ళి అయినకాడికి అమ్ముకొచ్చుకుంటానే. ఈ రెండు గంటల్లో ఎన్నమ్ముడు పోతయ్యో...ఏందో...మల్లీ రేపు సాయంత్రానిక్కదా బయటకెళ్లేది" దీనంగా అన్నాడు రాజయ్య.

మరీ తొక్కు కూడా వూడిపోయిన నాలుగయిదు పండ్లు మినహా మిగిలిన వాటన్నింటిని బండిమీద పేర్చింది జయమ్మ.

కండువా తలకు చుట్టుకుని చుట్ట నోట్లో పెట్టుకున్నాడు రాజయ్య.

మెల్లమెల్లగా జనం రోడ్లమీదకు రావడం మొదలుపెట్టటంతో, చుట్టపొగ గుప్పుగుప్పున వదుల్తూ బండిని తోసుకుంటూ రోడ్డుమీదకు చేరేడు రాజయ్య.

"అరటిపళ్లు, అరటిపళ్లు" అరుచుకుంటూ అడుగులు వేయసాగేడు రాజయ్య.

'మావా! తొందరగా వచ్చేయ్" పెద్దగా చెప్పింది జయమ్మ.

అట్లాగే అన్నట్టు తలాడించి ముందుకు సాగేడు రాజయ్య.

* * * *

"అంతగా తోచకపోతే అనంతయ్య కిళ్లీకొట్టు దగ్గరకు వెళ్లి కాసేపు కాలక్షేపం చేసుకురండి... బండీ వేసుకుని బజారుకు వెళ్తే ఏం గొడవలు జరుగుతయ్యో ఏమో." అనునయంగా అన్నది ఇందిర.

"గొడవలేం జరగవులే... నీదంతా భయం.. పదండి బావగారూ అలా సెంటర్ దాకా వెళ్లివద్దాం." భార్యను విసుక్కుంటూనే బావమరిదిని బయల్దేరదీశాడు భగవంతరావు.

"ఇక మీరు బయల్దేరదలుచుకున్న తర్వాత ఇంకొకరి మాటవింటారా. వెళ్తే వెళ్లండిగానీ కాస్త త్వరగా బయల్దేరి ఇంటికి చేరండి. పోలీసుల చేతుల్లో దెబ్బలు తినక" హెచ్చరింపుగా అన్నది ఇందిర.

"నేనున్నానుగా అక్కా.. బావగార్ని క్షేమంగా ఇంటికి చేర్చేపూచీ నాది. నువ్వు కంగారు పడక. కర్ఫ్యూ కబుర్లన్నీ వివరంగా వినిపిస్తాను వచ్చాక, అందాక వంటపని చూసుకో." అని స్కూటర్ బయటకు తీశాడు చిదంబరం.

"అన్నట్టు మర్చిపోయాను. స్కూటర్లో పెట్రోలున్నట్లు లేదు. బంకు దగ్గర బారులు తీరివుంటారు. బండి మధ్యలో ఆగితే అవస్థ పడతాం. నడిచే వెళ్దాంలే చిదంబరం." అన్నాడు భగవంతరావు.

స్కూటర్ స్టాండువేసి బయటకు నడిచారు బావ, బావమరుదులు.

* * * *

నాలుగు రోజులుగా నగరంలో కర్ఫ్యూ విధించారు. ఆఫీసుల్లేవ్. స్కూళ్లులేవ్. వీధులన్నీ నిర్మానుష్యంగా వుంటున్నాయ్. కూడలి స్థలాల్లో పోలీసులు వుంటున్నారు. రెండు గంటల సడలింపు ప్రారంభమయింది. కాబట్టి బ్రతుకుజీవుడా అని రోడ్ల మీద పడసాగేరు జనం.

కర్ఫ్యూ విధించి నాలుగు రోజులే అయినా ఒకర్నొకరు చూసుకుని ఎంతో కాలమయిందన్న భావన. మిత్రుల్ని, బంధువుల్ని కలుసుకోవాలన్న ఆరాటం. మూడు రోజుల తర్వాత ప్రకటించిన సడలింపు ప్రజానీకానికి బోలెడంత వూరడింపు.

రోడ్డున పడ్డ జనానికి రోజూ చూసే రోడ్లే కొత్తగా, వింతగా కన్పించసాగేయ్. మనుషుల్ని చూస్తుంటే అదోరకం ఆత్మీయతా భావం, దగ్గరితనం కలుగుతున్నది. ముఖ పరిచయం వుంటే చాలు ముసి ముసి నవ్వుల్తోనైనా పలుకరించుకుంటున్నారు.

ఆఫీసులకు వెళ్లడమంటే శిక్షగా భావించే వారిక్కూడా ఆఫీసులపై మమకారం పుట్టసాగింది. స్కూళ్లకి వెళ్లాలని ఉబలాటపడుతున్నారు పిల్లలు.

కిళ్లీకొట్టు దగ్గర పేపర్ కోసం ఎగబడుతున్నారు జనం.

"నే కూడా ట్రైచేస్తానుండండి" అంటూ గుంపులోకి జొరబడ్డాడు చిదంబరం.

అక్కడ జనం తొక్కిసలాటను తిలకిస్తూ నించున్నాడు భగవంతరావు.

పది నిమిషాల్లో పేపర్‌చేత పట్టుకుని విజయగర్వంతో తిరిగి వచ్చాడు చిదంబరం.

పేపర్లోని హెడ్‌లైన్లన్నీ ఆత్రంగా చదవసాగేరు. అయిదు నిమిషాలు అలా అలా పేపరుచూసి వాచీ వంక చూశాడు భగవంతరావు.

అలా రోడ్లమీద వుండేందుకు మరో గంట మాత్రమే టైముంది.

"అవునూ పేపరు మామూలు రేటేనా... ఏమైనా ఎక్కువ తీసుకున్నాడా" అడిగాడు భగవంతరావు.

"మామూలురేటా...సరేలే. మీరెంత అమాయకులండీ బావగారూ. అసలు ధర రెండ్రూపాయలయితే నాలుగు రూపాయలు తీసుకున్నాడు" చెప్పేడు చిదంబరం.

"రెట్టింపు ధరా!"

"సరేలే...అయిదు రూపాయలన్నా మారుమాట్లాడకుండా కొంటారు జనం. చూశారుగా ఇందాక కొట్టుదగ్గర కొట్లాట."

"మరీ ఇంత దారుణమా?"

"అవునూ ఓ రెండు టీ లాగించేద్దామా" అడుగుతూనే అటుగా నడిచాడు చిదంబరం. అనుసరించేడు భగవంతరావు.

జేబులో నుంచి డబ్బు తీయబోతున్న చిదంబరాన్ని వారించి "నేనిస్తా వుండు" అంటూ రెండ్రూపాయల కాయితం బయటకు తీసి చేయి ముందుకు చాచేడు.

"రెండు టీ" అన్నాడు.

"నాల్రూపాయలు, నాల్రూపాలీండి" రెండు గ్లాసుల్లోకి టీ పోస్తూ అన్నాడు టీ స్టాల్ కుర్రాడు.

"ఒక్కటి రెండు రూపాయలా" ఆశ్చర్యంగా అడిగేడు భగవంతరావు.

డబ్బులందించడం, టీగ్లాసులు రెండూ తన చేతుల్లోకి తీసుకోవడం చిదంబరానికి తప్పలేదు.

"అవన్నీ అడక్కూడదు బావగారూ. అదంతే" అంటూ టీ తాగేసాడు. చిదంబరం.

"ఇది అన్యాయమయ్యా. ఎంత కర్ఫ్యూ అయితే మాత్రం.. ఈ రెండు గంటల వ్యవధిలో ఇంతగా దోచుకోవాలా."

ఖాళీగ్లాసు స్టూలుపైన పెట్టి సిగరెట్ పాకెట్ కొనేందుకు పక్కనే ఉన్న కిళ్లీ కొట్టుకు వెళ్లాడు చిదంబరం.

"టైమయిపోతుంది త్వరగా రా" హెచ్చరింపుగా అన్నాడు భగవంతరావు.

టీస్టాల్ కుర్రవాడు పాత్రలు కడగనారంభించేడు. కిళ్లీ కొట్టతను, కొట్టు తలుపుకు తాడు కట్టి వేలాడదీసిన వార పత్రికల, సినిమా పత్రికలు తీసి లోపలపెట్టుకోసాగేడు.

"సిగరెట్లన్నా మామూలు రేటుకు కొన్నావా... లేకపోతే అవికూడా..."

"ఆపండాపండి బావగారూ... పేపర్లు, టీలు రెట్టింపు ధరల కమ్ముతుంటే సిగరెట్లు అసలు ధరలకు అమ్మే అమాయకులెవరండీ" బావగారి ప్రశ్న పూర్తి కాకుండానే సమాధానం చెప్పేడు చిదంబరం.

"అంటే ఇది కూడా డబుల్‌రేట్ పెట్టి కొన్నావా?"

"ఆహా... తప్పదు. అయినా అంతగా ఆశ్చర్యపోతారెందుకు బావగారూ. ఇవన్నీ చాలా మామూలు విషయాలే. ఇంగ్లీషులో 'ఎక్స్ప్లాయిటేషన్' అనే మాట ఒకటుంది కదా. అది ఇదే కదా."

మౌనంగా నడవసాగేడు భగవంతరావు.

రెట్టింపు ధరకు కొనుక్కున్న సిగరెట్‌ను వెలిగించుకున్నాడు చిదంబరం.

"ఎక్కడ చూసినా దోపిడి... దోపిడి. రిక్షావాలా దగ్గర్నుంచీ లక్షాధికారి దాకా ఎవరిస్థాయిలో వారు దోచుకుంటూనే ఉన్నారు. వాన పడుతున్నప్పుడు రెండురూపాయలు అదనంగా అడిగినా రిక్షా బాడుగ ఇచ్చేందుకు ఇబ్బంది వుండదు. కాని అర్జంటుగా హాస్పిటల్‌కు వెళ్లేటప్పుడు, సినిమా టైం అయిపోతుండగా థియేటర్‌కు వెళ్లేటప్పుడు రిక్షావాళ్లు ఎలా అడుగుతారో కదూ." చెప్పసాగేడు భగవంతరావు.

సిగరెట్ తాగుతూ తాదాత్మ్యత పొందుతున్న చిదంబరం మాట్లాడకుండా భగవంతరావు మాటల్ని ఆలకించసాగేడు. మధ్య మధ్యలో తల మాత్రం వూగిస్తున్నాడు.

మాటల్లోనే ఇంటిదాకా వచ్చేశారిద్దరు.

"అరటిపళ్లు.. అరటిపళ్లు" బండి నెట్టుకుంటూ ఇంటిదారి పట్టిన రాజయ్య అరుస్తున్నాడు ఆపూటకు ఆఖరి బేరం తగుల్తుందేమోనన్న ఆశతో.

"ఎలా ఇస్తున్నావో అరటిపళ్లు?" అడిగేడు చిదంబరం.

"డజను ఆర్రూపాయలండీ."

"ఆరా" ఆశ్చర్యం ప్రకటించిన భగవంతరావు బలవంతంగా చేయి పుచ్చుకుని వెనక్కు లాగేడు చిదంబరాన్ని.

బండికి దగ్గరగా జరిగి... "ఇచ్చేమాట చెప్పు. రెండు డజన్లు తీసుకుంటాను." అడిగేడు భగవంతరావు.

"అయిదు జేసుకుని తీసుకోండి సార్."

"ఆర్రూపాయలకు రెండు డజన్లు అయితే వద్దన్నాం. డజను రెండ్రూపాయలకిస్తే తీసుకుంటా."

"అంత తేడా వుండద్సార్. అయినా ఇంటికెళ్తున్నామని అయిదు కాడికీటమేగానీ మిగిలేదేం వుండదయ్యా" వినయంగా అన్నాడు రాజయ్య.

"నీ ఇష్టం."

"ఇంటికాడ్నించి బయల్దేరేటప్పుడు చుట్టుపక్కల పిల్లకాయలు చుట్టుముట్టి కాయిలిమ్మని చేతులు సాచినా ఈకుండా వచ్చేను. మీకు సగానికి సగం రేటుకు అమ్ముకునేకంటే అల్లకిత్తే ఆకలి దీర్చిన తృప్తన్నా వుంటది" అనుకుంటూ ముందుకు సాగేడు రాజయ్య.

"మరీ అన్యాయంగా అడిగేరు బావగారూ. అతను చెప్పింది కరెక్ట్ రేట్"అనునయంగా అన్నాడు చిదంబరం.

"నేనేం తెలివితక్కువగా అడగలేదు. ఆ అరటిపళ్ళు చూశావా పండిపోయి ఉన్నయ్. మళ్లీ రేపు సాయంత్రానిక్కదా అతను అమ్ముకునేది. అందాకా అవి వుంటయ్యాని నాకు నమ్మకంలేదు. మిగల పండి నుజ్జు నుజ్జవుతయ్. అందుకే ఎంతకడిగినా ఇస్తాడ్లెమ్మని అడిగే" అని నవ్వేడు గర్వంగా భగవంతరావు.

బావగారివైపు విస్మయంగా చూడటం మినహా ఏమీ అనలేకపోయాడు చిదంబరం.

"అయితే ఒక్క విషయం గ్రహించాలి. నీబోటి వాళ్లంతా." అంటూ బావమరిది వైపు చూశాడు అతను.

ఏమిటన్నట్టు చూశాడు చిదంబరం.

"అతనికున్న పట్టుదల, ఆత్మ నిగ్రహం మనకుంటే ఇలాంటప్పుడు రెట్టింపు ధరలకు పేపర్లు కొనం, మూడు రెట్లకు సిగరెట్ పేకెట్లు కొనం, క్యూలో నిల్చుని బండ్ల దగ్గర పెసరట్లు తినం."

అరటిపండ్లను అలా బేరం చేయకుండా వుంటే అతగాడి మాటలు నచ్చేవేగాని ఆ మాటలు అతను చెప్పటంవల్ల కాబోలు రుచించలేదు చిదంబరానికి.

ఏమైనా బావగారి మాటలు ఆలోచనల్లో పడేసినయ్ అతన్ని.

◆ ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక – జూలై, 1997 ◆



ఆంధ్ర... గ్రంథాలయము